

ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్లోబల్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల

# 'గల్ఫ్' బీమాపై ఎన్నారైల్లో సంబురం

- గల్ఫ్ వెతలు తెలిసిన సీఎం కేసీఆర్
- గ్లోబల్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల హర్షం
- గల్ఫ్ బిడ్డల కుటుంబాల్లో వెలుగులు : రాధారపు సతీశ్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : గల్ఫ్ కార్మికులకు 5లక్షల బీమా వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడంపై హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే ఈ సదుపాయాన్ని వర్తింపజేస్తామని కేసీఆర్ మాటివ్వడంపై గల్ఫ్‌కార్మికులు, ఎన్నారైలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్‌కు గల్ఫ్ కార్మికుల బాధలను పలుమార్లు విన్నవించానని, ఈ క్రమంలో వారికి అండగా నిలబడి బీమా సౌకర్యం కల్పిస్తామనడం హర్షణీయమని గ్లోబల్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల చెప్పారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీతో ఉత్తర తెలంగాణలోని లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనున్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంత వాసులకు మేలు జరుగుతుందని తెలిపారు. సీఎం కేసీఆర్ హామీపై ఎన్నారైల తరఫున మహేశ్ బిగాల ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల్లో కేసీఆర్ ధీమా నింపారని ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

### సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు

గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులు మరణిస్తే ఇక్కడ వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండేందుకు రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో గల్ఫ్ నుంచి సెలవులపై స్వగ్రామాలకు వచ్చిన కార్మికులు శుక్రవారం బాల్కొండ నియోజకవర్గంలోని వాడి, పచ్చల నడుకుడ గ్రామాల్లో సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు, వాడి సర్పంచ్ మహేశ్, పచ్చల నడుకుడ సర్పంచ్ ఏ గంగరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికులను కోటపాటి కోరారు.



వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు



**చొప్పదండి.. కదనభేరి** శుక్రవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని పత్తికుంటపల్లిలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో హాజరైన చొప్పదండి నియోజకవర్గ ప్రజలు

# కరీంనగర్‌లో పోరు కవాతు

- దండుతో కదిలివచ్చిన చొప్పదండి
- హుజూరాబాద్ హుషారు.. పరకాల జనహోరు
- సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు విజయవంతం
- నలుమూలల నుంచి భారీగా వచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు
- జననేత, గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగానికి జనం జేజేలు
- కళాకారుల ఆటపాటలకు ఉర్రూతలుగిన ప్రజలు

జగిత్యాల, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్ కార్పొరేషన్/ హుజూరాబాద్/జమ్మికుంట/వరంగల్ ప్రతినిధి: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పాల్గొన్న ప్రజా ఆశీర్వాద సభలు పార్టీ శ్రేణులు, ప్రజలతో పోటెత్తాయి. కరీంనగర్‌లో కదనభేరి కవాతు చేయగా, చొప్పదండి ప్రజలు నీరాజనం పలికారు. హుజూరాబాద్ జనం ఉర్రూతలూగగా, పరకాల జనజాతరను తలపించింది. కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం పత్తికుంటపల్లిలో, హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంటలో, పరకాల నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం జరిగిన ప్రజాఆశీర్వాద సభలు విజయవంతం అయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గంగుల కమలాకర్, సుంకె రవిశంకర్, పాడి కౌశిక్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలకు ఊరూరూ కదిలిరాగా సభా ప్రాంగణాలన్నీ జనసంద్రాన్ని తలపించాయి. మహిళలు, వృద్ధులు, రైతులు, యువత పెద్ద ఎత్తున సభకు తరలివచ్చి జననేత, సీఎం కేసీఆర్‌కు నీరాజనం పట్టారు. సభా ప్రాంగణాలు కిక్కిరిసిపోగా, వేలాది మంది రోడ్లపైనే బారులుదీరి కనిపించారు. కరీంనగర్‌లోని ఎస్సార్‌ఆర్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణమంతా జనంతో నిండిపోయింది. నగరంలోని 60 డివిజన్ల నుంచి మహిళలు భారీగా తరలివచ్చారు. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ గ్రామాల నుంచి సభకు వచ్చే దారులన్నీ గులాబీమయం అయ్యాయి. గంగాధ మండలం పత్తికుంటపల్లిలో నిర్వహించిన చొప్పదండి నియోజకవర్గ ప్రజాఆశీర్వాదసభకు జనసందోహం పోటెత్తింది. నియోజకవర్గంలోని గంగాధర, రామడుగు, చొప్పదండి, బోయిన్‌పల్లి, మల్యాల, కొడిమ్యాల మండలాల నుంచి పలు వాహనాల్లో ప్రజలు భారీగా తరలివచ్చారు. కేసీఆర్ తొలిసారి గంగాధర సభలో పాల్గొనడంతో ఆయనను చూసేందుకు ప్రజలు ఉత్సాహం చూపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభకు ఇసుకేస్తే రాలనంత జనం పోటెత్తారు. 'జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కౌశికన్న' అన్న నినాదాలు మిన్నంటాయి. ప్రముఖ కళాకారుడు మిట్టపల్లి సురేందర్ బృందం ఆట, పాటలు జనాన్ని ఆలోచింపజేశాయి. ముఖ్యంగా 'దేఖ్ లేంగే.., రామక్క..' పాటలు ఉర్రూతలూగించాయి. కళాకారులతోపాటూ ప్రజలూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పరకాలలో జరిగిన బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభ జనంతో కిటకిటలాడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగిస్తున్నంత సేపు జనం నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ధరణిని, రైతుబంధును తీసేసే కాంగ్రెస్ కావాలా అన్నప్పుడు.. వద్దు, వద్దు అంటూ జనం నినాదాలు చేశారు. కళాకారులతో కలిసి ప్రజలు ఆడిపాడారు. చప్పట్లతో కోరస్ కలిపారు.



పరకాల సభలో సీఎం కేసీఆర్‌కు జై కొడుతున్న వృద్ధురాలు

## కేసీఆర్‌పై ఇండియా టుడే కవర్ పేజీ స్టోరీ

- కెన్ కేసీఆర్ డు ఏ హ్యాట్రిక్? శీర్షికతో కథనం
- ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ
- 95-100 సీట్లు గెలుస్తామన్న బీఆర్ఎస్ అధినేత
- పూర్తి పాఠం రేపటి 'నమస్తే తెలంగాణ' సంచికలో

స్పెషల్ టాస్క్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): ప్రముఖ ఆంగ్ల వార పత్రిక ఇండియా టుడే తాజా సంచికలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌పై కవర్ పేజీ స్టోరీని ప్రచురించింది. ఈ కథనంలో సీఎంతో ఆ పత్రిక సీనియర్ డిప్యూటీ ఎడిటర్ కే అమర్‌నాథ్‌మీనన్‌తో పాటు ఇండియా టుడే గ్రూప్ ఎడిటోరియల్ డైరెక్టర్ రాజ్ చెంగప్ప చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూను కూడా ప్రచురించింది. 'కెన్ కేసీఆర్ డు ఏ హ్యాట్రిక్?' శీర్షికతో ప్రచురించిన ఈ కథనంలో.. తెలంగాణ ఉద్యమ నేపథ్యం, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కొత్త రాష్ట్రం అయినప్పటికీ అనతికాలంలోనే దేశంలో మరే రాష్ట్రం సాధించని రికార్డులు, ప్రగతిని సీఎం కేసీఆర్ వివరించారు. ఈసారి ఎన్నికలలో 2018 ఎన్నికల్లో సాధించిన సీట్ల కంటే ఎక్కువగా, 95-100 సీట్లు సాధించి, హ్యాట్రిక్ కొట్టబోతున్నట్టు కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన విమర్శలు, కుటుంబ పాలనగా ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం, ప్రధాని మోదీ తన పర్యటన సందర్భంగా ప్రస్తావించిన అంశాలపైనా మాట్లాడారు. తలసరి ఆదాయంలో, తలసరి విద్యుత్తు వినియోగంలో దేశంలోనే మేటిగా నిలిచిన అంశాలను గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ఏ స్థితిలో ఉన్నది? తెలంగాణ సిద్ధించాక రాష్ట్రాన్ని తాను ఏ విధంగా తీర్చిదిద్దింది? ఉదాహరణలతో వివరించారు. రాష్ట్రం ఏర్పడ్డాక విద్యుత్తు ఉత్పత్తి, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం, సాగు విస్తీర్ణం పెంపుదలపై ప్రధాన దృష్టి కేంద్రీకరించామని, ఫలితంగా దక్షిణాదిలో తెలంగాణ ధాన్యాభాండాగారంగా రూపుదిద్దుకున్నదని వెల్లడించారు. రాష్ట్రంలో తాజా రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను వివరిస్తూనే, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను కూడా సీఎం కేసీఆర్ తన ఇంటర్వ్యూలో ఎండగట్టారు. ఇంటర్వ్యూ పూర్తి పాఠం ఆదివారం నాటి నమస్తే తెలంగాణ సంచికలో ప్రచురితం కానున్నది.

# చార్‌సౌబీస్ మ్యానిఫెస్టో

మొదటిపేజీ తరువాయి...

పేర్కొన్నారు. కర్ణాటకలో రైతులకు కనీసం 3 గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అడ్డగోలు వాగ్దానాలు చేస్తున్నదని, రైతుబంధు, కల్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ వంటి పథకాలను కాపీ కొట్టిందని ఎద్దేవా చేశారు.

### ఓట్ల కోసం ఈటల ఝూటా మాటలు

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఓట్ల కోసం ఝూటా మాటలు మాట్లాడుతున్నారని హరీశ్‌రావు మండి పడ్డారు. మంత్రిగా ఉన్న సమయంలో సీఎం కేసీఆర్ గొప్పోడు, మంచి వాడు అని చెప్పిన ఈటల పార్టీ మారగానే మాట కూడా మార్చారని విమర్శించారు. అన్నం పెట్టిన కేసీఆర్‌ను మోసం చేసింది నువ్వు, సున్నం పెట్టింది నువ్వు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బూతులు మాట్లాడే వారికి పోలింగ్ బూత్‌ల్లోనే ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎడాపెడా అప్పులు చేసిందని విమర్శిస్తున్న ఈటల రాజేందర్.. తాను ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఎందుకు సంతకాలు పెట్టారని ప్రశ్నించారు. 3 గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లు కావాలంటున్న రేవంత్‌రెడ్డికి వ్యవసాయం తెలవదన్నారు.

### కేసీఆర్ రాక ముందు గజ్వేల్ ఎలా ఉండే..?

కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎలా ఉన్నదో.. ఇప్పుడు ఎలా ఉన్నదో ఆలోచించాలని హరీశ్‌రావు కోరారు. ఎవరో వచ్చి చెప్పే మాటలు నమ్మవద్దని, కండ్ల ముందు జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూడాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ గోదావరి నీళ్లు తెచ్చి మీ కాళ్లు కడిగింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరువు, కరెంటు కష్టాలు వస్తాయని పేర్కొన్నారు. 24 గంటల కరెంటు కావాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలని, సీఎం కేసీఆర్‌ను నిండు మనసుతో దీవించాలని కోరారు. 70 ఏండ్లలో జరగని అభివృద్ధిని తొమ్మిదేండ్లలో చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని చెప్పారు. నీళ్లు, కరెంటు, దవాఖానలు తెచ్చింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. రోడ్లు వేసి అభివృద్ధి చేసింది కేసీఆర్ అని గుర్తుచేశారు. రోడ్లకు గతుకులు వస్తే రేపు డాంబర్ కూడా కాంగ్రెస్, బీజేపీ వాళ్లు వేయరని ఎద్దేవా చేశారు. గజ్వేల్ దశ, దిశ మార్చింది కేసీఆర్ అని స్పష్టంచేశారు. నెత్తి మీద గంగమ్మ లెక్క కొండపోచమ్మసాగర్ తెచ్చింది కేసీఆర్ అని గజ్వేల్ ప్రజలు చెప్పుకుంటారని తెలిపారు. దక్షిణ భారతదేశంలో హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అవుతారని ధీమా వ్యక్తంచేశారు. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

> కర్ణాటకలో కాంగ్రెస్‌ను నమ్మిన పాపానికి ఇన్వర్టర్లు, కన్వర్టర్లు, జనరేటర్లు దిక్కు అవుతున్నాయి. అటువంటి స్థితే తిరిగి తెలంగాణలో రావాలా? ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే సొంత గ్రామంలోనే తాగునీరు, సాగునీరు, కరెంటు కష్టాలతో ప్రజలు సతమతం అవుతున్నారు.
>
> -మంత్రి హరీశ్‌రావు



**గజ్వేల్ గుండెల నిండా.. గులాబీ జెండా :** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు

### రాహుల్ గ్యారెంటీలు ఎన్నికల గారడీలు

రాహుల్‌గాంధీ ప్రకటిస్తున్న గ్యారెంటీలు ఎన్నికల గారడీలని మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కర్ణాటకలో తాము ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు రాహుల్‌గాంధీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలంటూ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ తెలంగాణలోనూ ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేయాలని చూస్తున్నదని విమర్శించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో కర్ణాటక దివాలా తీసిందని, ఆ పార్టీకి ఆర్థిక రంగంపై పట్టులేదని, మ్యానిఫెస్టో అమలుపై చిత్తశుద్ధిలేదని, సంపద సృష్టిపై ప్రణాళిక లేదని విమర్శించారు. 'వెలుగు దీపావళి కావాలా? కర్ణాటకలోలాగా ఆర్థిక దివాళా కావాలా? అభివృద్ధిని పాతరేసి, సంక్షేమానికి సమాధి కట్టే కర్ణాటక మాడల్ కావాలా?' ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఇచ్చిన గ్యారెంటీలకు షరతులు పెట్టి మోసం చేస్తున్నదని, రేపు తెలంగాణలో అదే పరిస్థితి సృష్టించదనే గ్యారెంటీలేదని పేర్కొన్నారు. కొత్త స్కీమ్‌ల జాడలేదు కానీ పాత పథకాలకు కర్ణాటక కాంగ్రెస్ పాతరేస్తున్నదని విమర్శించారు. కర్ణాటకలో విద్యార్థుల స్కాలర్‌షిప్పుల్లో 80 నుంచి 85% కోతలతో వాతలు పెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని మండిపడ్డారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్పును రూ.60 వేల నుంచి రూ.11 వేలకు తగ్గించిందని చెప్పారు. పీజీ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్పును రూ.35 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించారని, ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ విద్యార్థులపై పెనుభారం మోపిందని విమర్శించారు. వంద రోజుల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలుపెట్టి కర్ణాటకలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామని ప్రకటించిన రాహుల్‌గాంధీ ఆర్నేళ్లు అయినా ఒక్క నోటిఫికేషన్ ఎందుకు విడదల చేయలేదని ప్రశ్నించారు. కర్ణాటకలో యువశక్తిని ఈ సంవత్సరం పాస్ అయినవారికే ఇస్తామని, పాతవారికి ఇవ్వమని మెలికపెట్టింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కర్ణాటకలో యువశక్తి పథకం ఒక్కరికీ అందించలేదని చెప్పారు.

> శక్తి స్కీమ్‌లో శక్తి లేదు. గృహలక్ష్మి స్కీమ్‌లో లక్ష్మి లేదు. అన్నభాగ్య స్కీమ్‌లో బియ్యం లేవు. గృహజ్యోతి పథకంలో అంతా చీకట్లే. కర్ణాటకలో 5 గ్యారంటీలు చూసి ఓటేసిన ప్రజలకు అడుగడుగునా నిరాశే ఎదురైంది. కాంగ్రెస్‌ను నమ్మి అవకాశం ఇచ్చిన కర్ణాటక ప్రజలకు నిత్యం నరకం చూపిస్తున్నారు.
>
> -మంత్రి హరీశ్‌రావు

> కర్ణాటకలో హామీ ఇచ్చిన రాహుల్‌గాంధీ రాంరాం చెప్పారు. ప్రచారంలో మభ్యపెట్టిన ప్రియాంకాగాంధీ పత్తాలేకుండా పోయారు. ఏరు దాటాక తెప్ప తగిలేసినట్టు రాహుల్, ప్రియాంక కర్ణాటకను వదిలి తెలంగాణ మీద పడ్డారు. ప్రచార సమయంలో కనిపించే నాయకులు కావాలా? నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకులు కావాలా? ప్రజలు ఆలోచించాలి.
>
> -మంత్రి హరీశ్‌రావు

## జనరల్ డయ్యర్ సారీ చెప్పినట్టుగా చిదంబరం తీరు

తెలంగాణ ప్రజల హృదయాలను గాయపరచిన కేంద్ర మాజీ మంత్రి చిదంబరం బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడిన చిదంబరంపై ఆయన నిప్పులు చెరిగారు. 'కడుపులో చిచ్చుపెట్టి.. కండ్లు తుడవ వస్తరా' అంటూ ప్రజాకవి కాళోజీ రాసిన కవితను గుర్తుచేస్తూ.. చిదంబరం వ్యవహారసరళి కూడా అట్లాగే ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరుల తల్లుల కడుపుకోతపై చిదంబరం కారం చల్లినట్టే ఉన్నదని విమర్శించారు. అమరుల తల్లులు శోకం కాంగ్రెస్‌కు శాపంగా మారుతుందని హెచ్చరించారు. జలియన్‌వాలాబాగ్‌లో వెయ్యి మందిని కాల్చిచంపిన డయ్యర్ క్షమాపణ చెప్తే ఎట్లా ఉంటుందో.. చిదంబరం సారీ చెప్పినా అట్లనే ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంపినవారే సారీ చెప్పినట్టుగా చిదంబరం వ్యవహారం ఉన్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను ప్రజాకోర్టులో నిలబెట్టి అమరవీరుల తల్లిదండ్రులు కొరడాతో కొట్టినా తక్కువేనని పేర్కొన్నారు.

### రాహుల్‌కు దమ్ముంటే కర్ణాటక మాడల్‌తో ఓట్లు అడగాలి

రాహుల్‌గాంధీకి దమ్ముంటే కర్ణాటక మాడల్‌తో ఓట్లు అడగాలని మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. రాహుల్‌గాంధీ రాంగ్ గాంధీగా మారిపోయాడని ఎద్దేవా చేశారు. కర్ణాటక ఫెయిల్యూర్ మాడల్‌ను మెడలో వేసుకొని వస్తే నమ్మేందుకు ఎవరూ లేరని చెప్పారు. కర్ణాటక వలె మోసపోయే సమాజం తెలంగాణ కాదనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. కర్ణాటక ప్రజలను ఫెయిల్‌చేసిన రాహుల్ తెలంగాణ ప్రజల సంతోషాన్ని కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కర్ణాటకలో ఆర్నేళ్ల కాంగ్రెస్ పాలనలో 357 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని హరీశ్‌రావు వివరించారు. మళ్లీ మనకు ఇటువంటి పరిస్థితి రావాల్నా? అని ఆలోచించాలని తెలంగాణ రైతాంగాన్ని కోరారు. కర్ణాటకలో అన్ని వర్గాల ప్రజలు అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారని వివరించారు. ఆర్నేళ్ల కింద కాంగ్రెస్‌కు ఓటేసి తప్పుచేసిన కర్ణాటక ప్రజలు తలలు పట్టకుంటున్నారని, అటువంటి దుస్థితి తెలంగాణకు రాకూడదనే తమ తాపత్రయమని చెప్పారు. గెలిచే దాకా ఒక చాన్స్ ఇవ్వాలని అడిగి, గెలిచినంక ఎక్స్‌క్యూజ్‌మీ ప్లీజ్ అనే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, తిరిగి కేసీఆర్‌కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

> ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు పదేండ్ల కాంగ్రెస్ పాలనలో భర్తీ చేసిన ఉద్యోగాలు 13 వేలు మాత్రమే. కేసీఆర్ హయాంలో తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనతో దేశానికే నమూనాగా నిలిచింది. ఇప్పటికే 1.32 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. మరో 80 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. ప్రైవేట్ రంగంలో 24 లక్షలు, ఐటీ రంగంలో 6 లక్షల ఉద్యోగాల కల్పన జరిగింది.
>
> -మంత్రి హరీశ్‌రావు

### రేవంత్‌ది మేకపోతు గాంభీర్యం

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిది మేకపోతు గాంభీర్యమని మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9న తాను సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్టు ప్రకటించుకున్న నేపథ్యంలో మీడియా అడిగిన ప్రశ్నకు పై విధంగా స్పందించారు. గత ఎన్నికల్లో కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రకటించిన వ్యక్తి ఇప్పుడు సీఎం అవుతానని ప్రకటించుకుంటే ఏమవుతుందో ప్రజలే తేల్చుతారని పేర్కొన్నారు. ఎవరెన్ని కలలు కన్నా రాష్ట్రంలో హ్యాట్రిక్ సీఎంగా కేసీఆరే ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, కత్తి కార్తీక తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కత్తి కార్తీక తదితరులు

### బీఆర్ఎస్‌లోకి కత్తి కార్తీక

కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రలో పాల్గొన్న కత్తి కార్తీక కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి ఆమెను పార్టీలోకి స్వాగతించారు. కత్తి కార్తీకకు సముచిత గౌరవం, మంచి భవిష్యత్ అందిస్తామని ఈ సందర్భంగా హరీశ్‌రావు హామీ ఇచ్చారు.